# అల్లుడు అలిగితే…

శ్రీమతి అంబటిపూడి గోదావరమ్మ

సాయంత్రం 5 గంటలయింది. ఆఫీసు నుంచి రామారావు యిల్లు చేరేడు. అతని భార్య జానకి చిఱునవ్వుతో గుమ్మందగ్గఱ యెదురైంది. ఆమె కాఫీకప్పు అందించింది. అందుకుంటూ, పువ్వుల పొట్లం అందించాడతను.

"ఏమండీ! మంచిమాట" అందామె వయ్యారంగా.

"అంత మంచిమాట దాచకుండా ధర్మం చెయ్యి" అంటూ చెయ్యిచాచాడు రామారావు.

"మా నాన్న దగ్గరనుంచి పండుగ పిలుపు వచ్చింది. మరి శెలవుకు ప్రయత్నించండి." అంటూ ఆతృతగా అంగీకారాని కెదురుచూస్తూ నిలుచుంది జానకి.

అతని వుత్సాహం చలికాలంలో తెల్లవారుఝామున ఐసుక్రీము తిన్న చిన్నకుఱ్ఱాడి మొహంలా ముడుచుకుపోయింది.

"చాల్లెద్దూ! శక్తిలేని పడుగులు! నిలుడిస్తానన్న వాచీ యిప్పటికీ లేదు. పెళ్లిలో అలక పాన్పుమీదిస్తామన్న సైకిలుకి దిక్కు లేదు. సిగ్గులేని యీ పిలుపు లెందుకు? వెళ్లడానికి వీల్లేదు." అన్నాడు విసుగుతో.

అతని పట్టుదలచూచి జానకి దిగజారిపోయింది. "అది కాదండీ! పండుగనాడు నలుగురం కలిసి ఆనందంగా వుండడం ముఖ్యంగాని డబ్బే ప్రధానమా" అంది జాలిగా.

"జానీ! నన్ను విసిగించకు. కావాలంటే నువ్వెళ్లు. మీవాళ్లు పండక్కిచ్చే చీరకన్న రైలుకర్చులే యెక్కువ. ఆ డబ్బుతో అంతకంటె మంచి చీరే కొనుక్కోవచ్చు."

భర్త అహంకారాని కామె చాలా నొచ్చుకుంది. మౌనంగా వూరుకుంది.

2

ఆదివారం. ఆఫీసుకి సెలవు. మధ్యాహ్నం తీరికగా యింట్లో కూచుని టీ త్రాగుతున్నాడు రామారావు. తోటిగుమస్తా సుందర్రావు వచ్చేడు. "ఏం బ్రదర్! పండుగ పిలుపు వచ్చిందట. మీ ఆవిడ మా ఆవిడతో చెప్పేరట! ఎప్పుడేమిటి ప్రయాణం?" అని అడిగాడు సందడిగా.

"ఉండరా! సిగోల సిది! పండుగలాగే వుంది!"

"అదేం! వెళ్లవా?"

"ఊహుఁ"

"ఎందుకని?"

"ఎందుకని?"

"ఎందుకురా — రైలుఛార్జీలైనా కిట్టాలి

కనకనా? రానని, శలవు దొరకలేదనీ రాసి పోస్టుచేయించేను''

''ఓరి నీ అసాధ్యం కూల! ఎంత అబద్ధం! ఐనా చూడు బ్రదర్! డబ్బుతో ప్రేమా, అభిమానం కొనగలనా చెప్పు? తనవాళ్లనుచూసిన సంతోషం నువ్వు యెంత ఖర్చుపెట్టినా వస్తుందా? పండగ పిలుపులూ, ముచ్చటలూ అందరికీ జరగవు. తనకెవరూ లేరని ప్రతీ పండుగకీ మా ఆవిడ ముఖం చిన్నబుచ్చుకుంటూవుంటే నాకెంత బాధగా వుంటుందో తెలుసా? వచ్చిన అవకాశాన్ని నువ్వు జారవిడుచుకుంటున్నావు. నామాట విను. వెళ్లు. డబ్బున్నంత మాత్రంలో అన్ని సరదాలూ తీరవు.'' అన్నాడు సుందరం బోధపరుస్తూ. రామారావు ఆలోచనలో పడ్డాడు. మౌనం దాల్చాడు. సుందరం నిష్క్రమించాడు.

3

రేపే పండుగ. ఈవాళవరకూ జానకి ఓపికపట్టి వూరుకుంది. ఆమె ముభావంగా వుండడం అతను సహించలేకపోయాడు. ఆమెను ఉత్సాహపరచాలని ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఫలితం శూన్యం. అతను ఆలోచనలో పడ్డాడు. సుందరం అన్నట్టు తనవాళ్లని చూడడమే పండుగ కాబోలు! ఆ ఆనందం తను యితరత్రా యెలా బహూకరించినా ఆమె పొందదు కాబోలు! సరే. రేపే బయల్దేరాలయితే. ఎలా? రానని వాళ్లకి రాసేశాడు. జానకి మళ్లీ అడిగినా బాగుండేది... అతని ఆలోచన ఫలించింది. ఆమె దీనంగానే అర్థించింది. అతనంగీకరించాడు. జానకి ఆనందానికి పట్టపగ్గాల్లేవు.

4

తెల్లవారింది. జానకి హుషారుగా ప్రయాణానికి తయారైంది. రిక్షా వాకిట్లో నిలిచింది. దంపతులను స్టేషనుకి సాగనంపడానికి సుందరం వచ్చాడు. రామారావు యింటికి తాళంవేసి రిక్షాలో కాలు పెట్టాడో లేదో, పోస్ట్‌మేన్ ఉత్తరం అందించాడు. రామారావు చదివి భార్యకిచ్చాడు. ఆమె చదివి నిరుత్సాహంతో అతనికే అందించి, రిక్షాదిగి, ''తలుపు తియ్యండి'' అంది, ఆపుకుంటున్న ఏడుపు స్వరంతో.

సుందరం తెల్లబోయాడు. రామారావు చేతిలోని పుత్తరం తీసుకుని చదువుకున్నాడు. అందులో యిలావుంది.

''చి॥ అల్లుడు రామారావుకి మీమామ ఆశీర్వచనములు చేసి వ్రాయునది:-

నీ వుత్తరం అందింది. శలవు దొరకనందుకు చాలా విచారంగావుంది. మీరు రానిపండుగ మాకు సంతోషంగా వుండదు. ఈరోజు మా బావమఱది పనివుండి వచ్చాడు. ఈసంగతి తెలిసి నన్నూ, మీ అత్తగారిని వాళ్లయింటికి రమ్మని తీసుకెళ్తున్నాడు. తిరిగి వచ్చేటప్పుడు అక్కడదిగి నిన్నూ అమ్మాయినీ చూస్తాం.''

ఉత్తరం చదివిన సుందరానికి నవ్వాలో యేడవాలో తెలియలేదు. మౌనంగా యింట్లోకి వెళ్తున్న రామారావు దంపతుల నదోలాచూస్తూ, నిలబడివున్న రిక్షా యెక్కి పదమని సంజ్ఞచేశాడు. రిక్షా కదిలింది.